నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 16, 2025 | www.navatelangana.com

డీఎస్సీ-2008 అభ్యర్థులకు కౌన్సెలింగ్

నిర్మల్‌టౌన్ : పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు శనివారం డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించామని జిల్లా విద్యా శాఖాధికారి పి.రామారావు తెలిపారు. జిల్లాలో మొత్తం 20 మంది అభ్యర్థులు ఎంపిక కాగా ధ్రువపత్రాల పరిశీలనకు 17 మంది హాజరయ్యారు. ఒకరు నాట్ విల్లింగ్ ఇచ్చారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ అనుమతి మేరకు ఖాళీలను చూపి, కౌన్సెలింగ్ నిర్వహించి 1:1 పద్ధతిలో చూయించిన ఖాళీల నుండి వారికి నచ్చిన ప్లేస్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సూపరింటెండెంట్‌లు వెంకటరమణ, శ్రావణి, విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, ప్రవీణ్, నర్సయ్య, పరిశీలన అధికారులు శేఖ్ ఉస్సేన్, విజయకుమార్ పాల్గొన్నారు.



విద్యాశాఖ మంత్రిని నియమించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యా వ్యవస్థ బలహీనపడుతోందని పీడీఎస్‌యూ నాయకులు మండి పడ్డారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యా శాఖ మంత్రిని నియమించి పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం నుండి రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30శాతం నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సికిందర్, నాయకులు శ్రవణ్, సంతోష్, అనిల్, కళ్యాణ్, రమ్య, జ్యోతి పాల్గొన్నారు.



ఎట్టకేలకు ఊరట..!

- 2008డీఎస్సీ బీఈడీ అభ్యర్థులకు పోస్టింగులు
- ఎస్జీటీలకు ఇచ్చే మినిమం బేసిక్‌తో నియామకం
- ఉమ్మడి జిల్లాలో 74మందికి అవకాశం
- కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపత్రాలు జారీ

ఎట్టకేలకు 2008డీఎస్సీ అభ్యర్థులకు ఎట్టకేలకు ఊరట లభించింది. వీరికి న్యాయం చేయాలని అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాలు అనేక ఏండ్ల నుంచి చేస్తున్న విజ్ఞప్తికి ప్రభుత్వం స్పందించింది. కోర్టు ఆదేశాల మేరకు అప్పట్లో మెరిట్ సాధించిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా జిల్లా విద్యాశాఖ అధికారులు వీరికి ఆయా పాఠశాలల్లో నియమించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపత్రాలు జారీ చేశారు. ఎస్జీటీలకు ఇచ్చే మినిమం బేసిక్ పేను వర్తింపజేస్తూ కాంట్రాక్టు పద్ధతిలో ఆయా పాఠశాలల్లో నియామించారు. ప్రతి ఏడాది వీరి ఉద్యోగాలను రెనివల్ చేయనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. తమకు ఉద్యోగాలు కల్పించాలని 17ఏండ్లుగా వారు చేస్తున్న పోరాటం ఫలించినట్లయింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 74మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు కేటాయించడంతో ఏండ్లుగా నానుతున్న ఈ అంశానికి తెరపడినట్లయింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అందరి మాదిరిగానే వీరు సైతం నోటిఫికేషన్ ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రవేశ పరీక్ష రాశారు. ఇందులో మెరిట్ సాధించారు. కానీ కొన్ని కారణాలతో ఉద్యోగాన్ని మాత్రం పొందలేకపోయారు. దీంతో అందివచ్చిన ఉద్యోగం చేజారిపోయిందని అనేక ఏండ్ల నుంచి బాధపడగా తాజాగా కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం వీరికి ఉద్యోగాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం 2008లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులతో పాటు బీఈడీ అభ్యర్థులు కూడా అర్హులేనని స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్ అనుసరించి డీఎస్సీకి దరఖాస్తు చేసి ప్రవేశపరీక్ష రాసిన బీఈడీ అభ్యర్థులు ఉద్యోగానికి ఎంపికయ్యేందుకు అవసరమైన మెరిట్ సాధించారు. కానీ అప్పట్లో ఎస్జీటీ పోస్టులకు కేవలం డీఎడ్ అభ్యర్థులు మాత్రమే అర్హులని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మెరిట్ సాధించిన బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలు పొందలేకపోయారు. తాము నోటిఫికేషన్ ప్రకారమే డీఎస్సీ రాసి మెరిట్ సాధించామని ఉద్యోగాలు కల్పించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతామని అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన న్యాయస్థానం వీరికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి సూచనలు చేసింది. దీంతో ప్రభుత్వం వీరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చింది. తాజాగా ఎస్జీటీ పోస్టుల్లో వీరిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించి మినిమం బేసిక్ పే వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి అనుగుణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 74మందికి ఉద్యోగాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



ఏండ్ల నిరీక్షణ నెరవేరింది..!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన డీఎస్సీ 2008లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 35మంది బీఎడ్ అభ్యర్థులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. అప్పట్లో డీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో బీఎడ్ అభ్యర్థులను విధుల్లోకి తీసుకోవడంతో మన రాష్ట్రంలో బీఎడ్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈమేరకు విద్యాశాఖ కిందటేడాది సెప్టెంబర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టగా 76మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఇందులో ఇద్దరు డీఎడ్ అభ్యర్థులు ఉండటంతో వారిని మినహాయించగా మిగితా అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించారు. వీరందరినీ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పేరిట ఎస్జీటీలకు ఇచ్చే మినిమం బేసిక్‌తో కాంట్రాక్టు పద్ధతిలో నియమించడంతో దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభించింది. దీంతో ఏండ్లుగా ఉద్యోగాల కోసం నిరీక్షించిన అభ్యర్థుల ఆశలు ఎట్టకేలకు ఫలించినట్లయింది.

ఉద్యోగం లభించడం సంతోషంగా ఉంది :

ఎర్రం రవీందర్‌రెడ్డి, 2008 డీఎస్సీ అభ్యర్థి

అప్పట్లో చేతికి అందిన ఉద్యోగం చేజారిపోవడంతో చాలా బాధపడ్డాం. ఎంపికైన కొందరికి సరైన ఉపాధి లేకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 16ఏండ్లుగా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్య పట్ల స్పందించి మినిమం బేసిక్‌తో ఉద్యోగాలు కల్పించడం చాలా సంతోషంగా ఉంది.



దొంగ అరెస్టు : మూడు బైక్‌లు స్వాధీనం



సారంగాపూర్ : మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన ముప్కాల రాకేష్‌రెడ్డి గతంలో వైన్స్ షాప్, ధాబాలో పనిచేస్తూ ఉండే వాడు. కొన్ని రోజుల నుండి పని మానేసి మద్యానికి అలవాటు పడ్డాడు. జల్సాలకు డబ్బుల కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. 3 నెలల క్రితం నిర్మల్‌టౌన్ పరిధిలో దొంగతనాలు చేసి జైలుకెళ్లి తిరిగొచ్చాడు. అయినా బుద్ధి మారకుండా బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 12న బుధవారం సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలో సీబీ షెయిన్ బైక్ దొంగతనం చేశాడు. పోలీసులు దర్యాప్తులో భాగంగా శనివారం నిందితుడు రాకేష్‌రెడ్డిని చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌తో సహా పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలో, నిర్మల్ వెంకటాపూర్‌లో కూడా 2 బైక్‌లు చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. రెండు రోజుల క్రితం నిర్మల్‌టౌన్‌లో ఒక బైక్ మెకానిక్ షాప్ తాళాలు పగలగొట్టి అందులో గల బ్యాటరీ సామాను దొంగలించినట్టు తెలిసింది. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.లక్షా45వేల విలువ గల 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ కానిస్టేబుల్స్ ఆకాష్, లింగారాం, వినీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్‌కు బస్సు, ట్రక్కు మంజూరు



ఆదిలాబాద్‌టౌన్: విపత్తు సమయంలో త్వరగా బాధితులను సురక్షితంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఆదిలాబాద్ ఫైర్‌స్టేషన్‌కు బస్సు, ట్రక్కు మంజూరైంది. వీటిని శనివారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ కుమార్ ప్రారంభించారు. వాటి పని తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు సమయంలో సామాగ్రితో పాటు ఇతర వస్తువులను తరలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌కూ బస్సుతో పాటు ట్రక్కు కూడా వచ్చిందన్నారు. ఇప్పటికే ఫైర్, పోలీసు శాఖలోని సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అంతే కాకుండా వరదల సమయంలో బోర్డును తీసుకొచ్చేందుకు ట్రాక్ వినియోగంలోకి వస్తుందన్నారు. బాధితులకు ప్రమాద స్థలం నుంచి సురక్షిత స్థలానికి చేర్చడానికి సాయంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జత్‌రాం, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీపడదగ్గ కేసులను పరిష్కరించేలా చొరవ చూపాలి



ఆదిలాబాద్‌టౌన్ : మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌తో అత్యధికంగా రాజీపడదగ్గ కేసులను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు హాలులో పెండింగ్ కేసులపై పోలీసు శాఖ అధికారులతో జడ్జి సమీక్షించారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల వారీగా పెండింగ్ కేసులు, ఎన్బీడబ్ల్యూ, ట్రయల్స్ తదితర వాటి గురించి చర్చించి పలు సూచనలు చేశారు. పోలీసులు స్టేషన్ పరిధిలో కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టులలో సంవత్సరాల పాటుగా పరిష్కరించబడని కేసులు రాజీ పడడం వల్ల తక్షణం పరిష్కరించబడి సమయం, డబ్బులు, వృథా కాకుండా ఉంటాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయాన్ని పొంది ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీలజైన్, సౌజన్య, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డిజిటల్ అవగాహన



నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డిజిటల్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి రీజినల్ మేనేజర్ సొలొమాన్, ఏఎస్పి ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సంర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ బస్టాండ్‌లో బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు జాగ్రత్తలు వహించాలని, బైక్, కార్లు నడిపేవారు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. నిర్మల్ బస్టాండ్‌లో డిజిటల్ వీడియోలో ప్రసారం చేయిస్తున్నామని, ప్రయాణికులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఏఎస్పి మాట్లాడుతూ నూటికి నూరు శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయన్నారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించకుండా ఓవర్ టేక్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.నవీన్‌కుమార్, స్టేషన్ మేనేజర్ ఏఆర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుది పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణ



ఆసిఫాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రానున్న రోజుల్లో జిల్లాలో జరగనున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను శనివారం ఎంపిడిఓ శ్రీనివాస్ కార్యాలయ ఆవరణలో ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల వారిగా పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమయ్యామని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బాలేశ్వర్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీటీసీల వారీగా పోలింగ్ కేంద్రాల తుది జాబితాను అధికారులకు ప్రదర్శించారు. 2వ సాధారణ ఎన్నికల సందర్భంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పురస్కరించుకొని ఎంపీటీసీల వారీగా పోలింగ్ కేంద్రాలను ఫైనల్ జాబితాను నోటీస్ బోర్డుపై ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో శేఖ్ సప్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు క్రాంతి కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ఎన్నికల విధులపై ఉద్యోగులకు శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 27న నిర్వహించే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్‌స్టేషన్‌లను పరిశీలించాలని, ఎమ్మెల్సీ పోలింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి పొరపట్లకు తావులేకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని, సందేహాలుంటే శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 220 మంది, జోనల్ ఆఫీసర్లు 9 మంది ని కేటాయించడం జరిగిందని తెలిపారు. శిక్షణ తరగతులను శ్రద్ధగావిని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన చేసుకోవాలని, ఇదివరకు నిర్వహించిన ఎన్నికల మాదిరిగానే ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తేకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పీఓలదే అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్‌లో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. పోలింగ్ డే సందర్భంగా పీఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్లు రాజేశ్వర్, జగన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రెండవ విడత శిక్షణా తరగతులు ఈ నెల 21న నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో రామిరెడ్డి, సూపరింటెండెంట్ పంచపూల, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



బీజేపీ, బీఆర్ఎస్ కుల రాజకీయాలను తిప్పికొట్టాలి

- జెండా మోసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్

బీజేపీ, బీఆర్ఎస్ కుల రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిప్పి కొట్టాలని, ప్రజా సేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు ప్రచారం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబీ, దస్తురాబాద్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. సిరి సంపదలు కలిగిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ కుటుంబ పాలనను ప్రజల్లో ఎండగట్టాలని కార్యకర్తలను కోరారు. దేశంలో బీజేపీ, బీఆర్ఎస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, కుల రాజకీయాలను ప్రజలకు తెలియజేసి చైతన్యం చేయాలని పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పార్టీపై, ప్రజా ప్రభుత్వం వస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్, రాజురా సత్యం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, అంకం రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, కమలాకర్, ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీకి బహిరంగ లేఖ

నవతెలంగాణ-మంచిర్యాల



దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో బిసి సంఘాల నాయకులు ప్రధాని మోడీకి బహిరంగా లేక పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులగణనను చేపట్టిందని, దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా కుల గణన చేపట్టకపోవడం బీసీలపై వివక్షగా భావిస్తున్నామన్నారు. జనగణనలో కులగణనను భాగం చేస్తే విద్యా, ఉద్యోగాలతో పాటు ప్రస్తుతం స్థానిక సంస్థలలో కొనసాగుతున్న రిజర్వేషన్లు పెంచాల్సి ఉంటుందని కేంద్ర పాలకులు భావిస్తున్నారు కాబట్టే బీసీ కులగణన చేపట్టడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి బీసీలకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, భీంసేన్, కర్రె లచ్చన్న, శ్రీపతి రాములు, గజ్వేల్లి వెంకన్న, అంకం సతీష్, రాజన్న, చారి, కీర్తి రవి, ఆరెందుల రాజేశం, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగులకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



న్యాయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులు ఒత్తిడితో విధులు నిర్వహిస్తారని, ఈ క్రమంలోనే వారి ఆరోగ్య పరిరక్షణ కష్టంగా మారుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. అందుకే సిబ్బంది కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శనివారం కోర్టులో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత ఆయన వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిత్యం ఉరుకులు, పరుగులతో కోర్టు ఉద్యోగుల విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో వారికి తెలియకుండానే అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. మారుతున్న ఆరోగ్య అలవాట్లు కూడా దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో వారి ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యంగా ఉన్నాం ఏమీ కాదన్న భ్రమలో ఉండొద్దన్నారు. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకు ఒక సారి వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీలజైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, డీఎంహెచ్ఏ డాక్టర్ నరేందర్ రాథోడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు గ్రామస్తులు వినతి

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మిస్తున్న ప్రహరిగోడతో నయా అబదికి వెళ్లే ప్రధాన రోడ్డు మూసుకుపోయే అవకాశాలు ఉన్నాయని, దీంతో ప్రధాన రోడ్డుకు దారి వదిలిన తరవాత మాత్రమే ప్రహరీ గోడ నిర్మించాలని గణేష్‌నగర్ వాసులు, గ్రామస్తులు శనివారం భైంసా ఆర్టీసీ డీఎంకు



వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ప్రధాన రోడ్డుకు దారి వదలని యెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు శంకర్, ఏశాల దత్త్రాత్రి, సాయినాథ్, విశ్వనాథ్, శంకర్, ప్రతాప్ సింగ్, విఠల్ ఉన్నారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. శనివారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెల తనిఖీలో భాగంగా స్థానిక శాంతినగర్ ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లలో సంతకం చేశారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ పంచపూల, సిబ్బంది దేవరాజ్ ఉన్నారు.



సంత్ శ్రీ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంత్ శ్రీ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం పట్టణంలోని సేవాదాస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా సేవాలాల్, దుర్గామాత చిత్రపటాలకు పూజలు చేశారు. ముందుగా పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసి సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు. ఆధ్యాత్మికవైపు ప్రజలకు నడిపించడంలో కృషి చేశారన్నారు. నేడు ప్రభుత్వం కూడా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ నిధులు కేటాయించిందన్నారు. ఈనెల 24న జయంతి ఉత్సవాలను అధికారంగా చేపడుతున్నట్టు పేర్కొన్నారు. జయంతి సందర్భంగా పాఠశాలలో వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని ప్రతి తండాతో పాటు ఉట్నూర్‌లో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను బంజారా ప్రజలు సంస్కృతి, సాంప్రదాయకంగా ఘనంగా జరుపుకున్నారు. శనివారం సేవాలాల్ ఆలయంలో భోగ్ భండార్ పూజ కార్యక్రమం చేసి, సేవాదాస్ నగర్ నుంచి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న సేవాలాల్ మహారాజ్ జెండా వరకు పల్లకి శోభ యాత్ర ను నిర్వహించారు. అనంతరం తిరుమల ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బంజారా భీష్మ అమర్ సింగ్ తిలావత్, మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ పాల్గొని వారు మాట్లాడారు. 1739 ఫిబ్రవరి 15న సేవాలాల్ జన్మించారు. జీవితాంతం బ్రహ్మచర్యం పాటించిన సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ 18వ శతాబ్దంలో భారతదేశం మొత్తం సంచరించారు. ఆవులను మేపుకుంటూ సమస్త బంజారా సమాజాన్ని జాగృతం చేశారు. సంచార జీవితం నుంచి తండ రూపంలో స్థిర నివాసం ఏర్పరచుటకు తన వంతు కృషి చేశారని అన్నారు. అందుకే ఈ రోజు 15 కోట్ల బంజారా ప్రజల ఆరాధ్య దైవంగా ప్రజల హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయిన దైవమని అన్నారు. సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపరచాలనీ, జీవిత చరిత్ర నేటి రేపటి యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మూడు నమ్మకాలను తొలగించి వారి జీవన విధానంలో మార్పు తెచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కమిటీ ఉట్నూర్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపెల్లి దీక్ష భూమి, భీంపూర్, నాగల్‌కొండ, తాడిహత్నూర్, గంగాపూర్, రాజులగూడ, ఎంపల్లి, ఉమ్రి, మహాగావ్, తదితర తండాల్లో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో జెండాను ఆవిష్కరించి, సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం భోగ్ బండార్ పూజలు చేశారు. అదేవిధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహారాజ్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. దీనితో తండాలో సేవాలాల్ మహారాజ్ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్ నాయక్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తమ్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ సర్పంచులు రాథోడ్ మధుకర్, రాథోడ్ యశ్వంత్ రావ్, రాథోడ్ విష్ణు, రాథోడ్ రామేశ్వర్, రాథోడ్ రవీందర్, రాథోడ్ సావిందర్, జాదవ్ సునీత నారాయణ్, మాజీ ఎంపీటీసీ కళావతి, ఉత్తం తండా నాయక్ కారోబారి, డాబ్, గేరియా భక్తులు పాల్గొన్నారు.

సేవాదాస్ పాఠశాలలో...

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలను జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సూర్యవంశీ పండరి, కల్వలె అరవింద్, అనిరుద్రు, పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజీ, గ్రామ పెద్దలు రాథోడ్ దినేష్ పటేల్, జాదవ్ నాగ్‌రాజ్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

భైంసా : సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ బోధనలు ఆచరనీయమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. శనివారం భైంసాలోని సేవలాల్ మహారాజ్ చౌక్‌లో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనులతో పాటు సమస్త హిందువులకు ధర్మం, విశిష్టతను వివరించిన మహా యోగి అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ భక్తి భావంతో ముందుకు సాగితే ఆదర్శవంతమైన జీవనం గడప వచ్చాన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు బంజారా సంస్కృతి ఉట్టి పడేలా చేపట్టిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రాజేష్ బాబుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



భైంసా

బోథ్ : సొనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలోని శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు చైతన్య మాట్లాడుతూ మత మార్పిడుల పట్ల గిరిపుత్రులలో అవగాహన కల్పించడం కోసం దేశంలో ఎన్నో ప్రాంతాలలో ఉన్న బంజారాలలో వారు చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. బంజారాల ఐక్యతకు కృషి చేశారన్నారు. అలాగే మద్యం తాగడం, జంతుబలి, దొంగతనాలు, పేదవారిని బాధపెట్టడం వంటి ఎన్నో చెడుపనుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాత్ పంచాయితీ అనే పేరుతో హోలీ రోజున అందరూ కలిసేలా ఓ ఏర్పాటు ఇలా ఎన్నో రకాలైనటువంటి సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని విట్టోలి తండ, రాజు తండ, చింతకుంటా తండ, తరోడా తండ, ఎడ్‌బిడ్ తండ, తదితర గ్రామాలలో శనివారం బంజారాల ఆరాధ్య సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బంజారాల నాయకులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఎడ్‌బిడ్ తండాలో ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బంజారాల కుల పెద్దలు, తండవాసులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో బంజార సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించి, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజాలు చేశారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు సంతోష్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్, భారత గిరిజన ప్రజలకు ఆరాధ్య దైవం లంబాడీలను అహింసావాదం వైపు నడిపించిన దర్శనికుడు, బ్రహ్మచార్య నిష్టను ఆచరించి ఎంతోమంది గిరిజనులను ఆకర్షించిన మహనీయుడు అని అన్నారు. తెలంగాణలో గిరిజనులు ఆరాధించే ఆధ్యాత్మిక గురువు సంతు సేవాలాల్ మహారాజ్ అని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడువాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, బంజారా నాయకులు వినత్‌రావు, రాథోడ్ అనిల్, నరేందర్ పాల్గొన్నారు.



ఉట్నూర్



బోథ్

వృత్తి నైపుణ్య శిక్షణాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వయం ఉపాధిలో రాణించేలా అందిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ముస్లీం వెల్ఫర్ ఆర్గనైజేషన్, ప్రముఖ న్యాయవాది మహ్మద్ గౌస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ భవన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, యువతుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్, మగ్గం, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, శిక్షణను వినియోగించుకుంటూ రాణించాలని సూచించారు. మహిళలు, యువతులు స్వయంలో ఉపాధిలో రాణించి కుటుంబానికి బాసటగా ఉండేందుకు ఉర్దూ భవన కమిటీ ఆధ్వర్యంలో శిక్షణనివ్వడం అభినందనీయమన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటు కుటుంబానికి చేయూతనిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆకాక్షించారు. భవిష్యత్తులో ఎలాంటి సహకారం కావాలన్న తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎండబ్ల్యూఓ ప్రధాన కార్యదర్శి ఖలీల్, అమన్ ఫౌండేషన అధ్యక్షుడు అర్బాథ్ ఖాన్, నూర్ ఖాన్, ఉర్దూ భవన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, అబ్దుల్ రజక్, రఫీక్, ఫయాజ అహ్మద్‌షా, బీమ్ ఆర్మీ అధ్యక్షులు షకీల్ పాల్గొన్నారు.

నూతన సాంకేతిక కంప్యూటర్ల అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌లకు శనివారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల నూతన సాంకేతిక కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మెరుగైన సేవలు అందించేందుకు నూతన కంప్యూటర్లు, ప్రింటర్లు, వెబ్ కెమెరాలను అందజేయడం జరిగిందని తెలిపారు. కోర్టు కేసుల వివరాలు ఎంట్రీ చేసి త్వరితగతిన స్పందించడానికి గాను అన్నీ పోలీస్ స్టేషన్‌లో కోర్టు డ్యూటీ అధికారులకు, కోర్టు సమన్వయ అధికారులకు, ప్రాసిక్యూషన్ అధికారులకు వివరాలు అందించటం కోసం పోలీస్ స్టేషన్‌లలో కంప్యూటర్ల కొరత లేకుండా అందించామన్నారు. సీనియర్ అధికారులు, ఇన్వెస్టిగేషన్ అధికారులు కోర్టులో వివరాలు తెలుపటం కోసం ఆన్‌లైన్‌లో వెబ్ కెమెరా సహాయపడుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఎస్సైలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ప్రవేశాల పోస్టర్‌ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గురుకుల డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్‌లను కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కళాశాల అడ్మిషన్ పోస్టర్‌లను కళాశాల యాజమాన్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. త్వరగా అభ్యర్థులు కళాశాలను సందర్శించి, తమ అడ్మిషన్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో చేరి భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.శివకృష్ణ, సిబ్బంది రామకృష్ణ, విఠల్, రాజేష్, సురేందర్, ప్రితమ్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో పది కీలకం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విద్యార్థులకు పదో తరగతి కీలకమని, విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపి, మంచి ఫలితాలు సాధించాలని, జీసీడీఓ మెస్రం ఛాయా అన్నారు. శనివారం మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మడగూడను ఆమె సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలలోని పలు రికార్డులతో పాటు పాఠశాల ఆవరణ, వంట సరుకులను, వంట గదులను, సిక్ గది, స్టోర్ గదులను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదవాలని, అందరు విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం స్థానిక వైద్యులు విద్యార్థులకు వైద్యపరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, స్థానిక వైద్యాధికారి భీమ్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాత

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేరుతో నఖిలీ ఫేస్ బుక్ ఖాతాను ఓ వ్యక్తి సృష్టించాడు. అలాంటి ఖాతాను నమ్మవద్దని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ పేరుతో కొందరు నకిలీ ఫేస్ బుక్ ఖాతాలను ఏర్పాటు చేశారని, ఆయా ఫేస్ బుక్ ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని సూచించారు. ఈ నఖిలీ ఫేస్ బుక్ ఖాతాలపై ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

మెగా రక్తదాన శిబిరానికి హజరు కావాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి కలెక్టర్ రాజర్షిషాను, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ప్రశాంత్ హజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, రక్తదాన శిబిరానికి హజరవుతున్నట్టు సభ్యులు పేర్కొన్నారు. రక్తదానం చేసే యువకులు ముందుకు రావాలని కోరారు. ఇందులో యూత్ సభ్యులు కేంద్రే సంతోష్, ఫడ్ రవీందర్, మానే సంతోష్, సీడం కైలాస్, జాదవ్ యువరాజ్, చిక్రం మనోహర్, జాబాడే వినోద్, పోప్లె ఎక్‌నాథ్, మెస్రం శేఖర్‌బాబు ఉన్నారు.

గిరిజనేతరులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-ఇచ్చోడ

ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న గిరిజనేతరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వారికి అండగా ఉంటామని మేడిగూడ సార్మేడి మెస్రం శంభూ అన్నారు. శనివారం మండలంలోని మేడిగూడ రాయి సెంటర్ పరిధిలోని 33 గోండ్వానా పంచాయతీలకు సంబంధించిన పటేల్, దేవరి మహాజన్‌ల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు కోడప నగేష్ మాట్లాడుతూ ఇచ్చోడ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. అలాగే కొన్ని కీలకమైన ఒప్పందాలు కూడా తీసుకోవడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడలో ఆదివాసుల ఆస్తుల రక్షణకై నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గిరిజనేతరుల ఆస్తుల జోలికి గిరిజనులు ఎవరు కూడా రారని తెలిపారు. కొందరు ఆర్టీఐ పేరిట వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఇచ్చోడలో ఇంటి నిర్మాణాలపై నోటీసులు ఇచ్చుటను రాయి సెంటర్ తరఫున వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, గిరిజనేతరుల ఇంటి నిర్మాణం సందర్భంలో ఆర్టీఐ వేసి అక్రమాలకు పాల్పడుతున్న ఎవరైనా సరే రాయి సెంటర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపసార్మేడి కుంరం జ్యోతిరాం, మాజీ ఐటీడీఏ డైరెక్టర్ తులసి రామ్, గోండ్వానా పంచాయతీల పటేళ్లు, పెందూర్ భీంరావు, కళ్లె లక్ష్మణ్, సిడం లక్ష్మీకాంత్, కోడప జలై జాకు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

విద్యార్థులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఈఓ రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సీబీ టెస్టులు నిర్వహించామన్నారు. అనంతరం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా సంత్ సేవాలల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని వైద్య శిబిరం నిర్వహించిన సందర్భంగా హెచ్ఈఓ రవీందర్, సూపర్‌వైజర్, శ్రీనివాస్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయుడు అశోక్ శాలువా తో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత, ఆశ వర్కర్ జయమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ టెండర్లకు అటవీశాఖ పిలుపు



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిరసన, పోరాటల ఫలితంగా తునికాకు సేకరణ టెండర్లకు ఆదేశాలు వచ్చాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండలాధ్యక్షులు మాడవి నశిక్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో నివసించే వేలాది గిరిజన కుటుంబాలకు జీవనాధారమైన తునికాకు సేకరణ ప్రక్రియలో నెలకొన్న జాప్యాన్ని నిరసిస్తూ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పోరాటం చేపట్టింది. ఈ ఉద్యమం ఫలితంగా అటవీశాఖ దిగివచ్చి, తునికాకు సేకరణకు అవసరమైన టెండర్ ప్రక్రియను ప్రారంభించారని అన్నారు. సాధారణంగా ప్రతీ ఏడాది డిసెంబర్ నెలలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, జనవరి నాటికి తునికాకు కొమ్మకొట్టుడు (ప్రూనింగ్) పనులను ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఈసారి అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా, ఫిబ్రవరి నెల మధ్య వరకు టెండర్లు విడుదల కాకపోవడం వల్ల వేలాది గిరిజన కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడిందన్నారు. ఈ జాప్యాన్ని టీఏజీఎస్ తీవ్రంగా నిరసిస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో, అటవీశాఖ చివరికి తునికాకు టెండర్లను ప్రారంభించిందన్నారు. ఇదే గిరిజనుల సంఘటిత శక్తికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం తునికాకు సేకరణ ప్రక్రియలో జాప్యం తలెత్తనివ్వకూడదని, తక్షణమే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, పదిరోజులలోగా ప్రూనింగ్ పనులను ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం శేకు, మెస్రం నాగోరావు, ఆత్రం భీంరావ్, సిడం ఆనందరావు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న నిర్వహించే చలో హైదరాబాద్ గోడ ప్రతులను ఖానాపూర్ మండలంలోని రంగపేట్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా ఇప్పటివరకు, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2500, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని, పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా కోశాధి కారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, గూట్ల ప్రసాద్, కూడుదుల రాజేష్, మాన్క శ్రీనివాస్, గంగన్న, నర్సపల్లి రాజన్న, గోనె రాజేష్, సీడం బీంరావు, లింగాల శంకర్, రాములు, ఆత్రం సావిత్రి, కనక చంద్రకళ, కొమురం వనిత, శీడం చంద్రకళ, నైతం లింగుబాయి, గోగు భూమవ్వ పాల్గొన్నారు.



నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

ఆదివారం | ఫిబ్రవరి 16, 2025 | www.navatelangana.com

లక్ష్యం మేరకు పన్ను వసూలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో లక్ష్యం మేరకు ఆస్థి పన్ను వసూళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి దీపక్ తివారి ఆదేశించారు. శనివారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది చేపడుతున్న ఆస్థి పన్ను వసూలును ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఆస్థి పన్ను వసూలు శాతం ఎంతమేరకు జరిగిందని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను ప్రశ్నించగా 46 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు సమీపిస్తున్నందున వంద శాతం ఆస్థి పన్ను వసూలుపై దృష్టి సారించాలని ఆయన కమిషనర్‌కు సూచించారు.

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కౌటాల



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఎంపీడీఓ కోట ప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు.


చలో విద్యుత్ సౌదా విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టీ.న్స్ కార్మికుల కన్వెన్షన్ డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న నిర్వహించే చలో విద్యుత్ సౌద విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్స్ కన్వెన్షన్ జాయింట్ ఆక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆత్రం మారుతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయ ఆవరణలో చలో విద్యుత్ సౌధ కార్యక్రమం పోస్టర్‌ను జేఏసీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 20వేల మంది ఆర్టిజన్స్ పనిచేస్తున్నారని వీరికి విద్య అర్హతలను బట్టి సబ్ ఇంజనీర్లు, జూనియర్ అసిస్టెంట్, జెఎల్ఎం, ఆఫీస్ సబార్డినేట్‌గా కన్వెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు, బస్సు యాత్రలు చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో ఆర్టిజన్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి ఏకాంబరం, ప్రేమ్ సాగర్, శ్యామ్ రావు, సతీష్, మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని కన్నెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం నేను సావిత్రిబాయి పూలే అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రామ మాలీ సంఘం యువజన అధ్యక్షుడు మోర్లె పాండురంగ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహించారు. పోటీల నిర్వహణకు ముందుకు వచ్చిన పాండురంగ్‌ను ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కన్నెపల్లి యువకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు..వన్యప్రాణులకు ముప్పు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తునికాకు, ఇప్పపువ్వు సేకరణ కోసం లేదా మరే ఇతర కారణంగా అడవికి నిప్పు పెడితే చర్యలు తీసుకుంటామని సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావు అన్నారు. శనివారం మండలంలోని మేడిపల్లి, చిన్నమాలిని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల అడవి జంతువులకు అవసరమైన ఆహారం అగ్నికి ఆహుతి అవుతుందని, అగ్నిలో చిక్కుకుని వన్యజీవులు మరణించిన సంఘటనలు అనేకంగా ఉన్నాయన్నారు. అనంతరం గతంలో పెద్దపులి దాడిలో మరణించిన పశువుల యజమానులకు నష్టపరిహారం అందజేశారు. చిన్నమాలిని గ్రామానికి చెందిన సుర్పం గన్నుకు రూ.22 వేలు, సుర్పం జంగుకు రూ.27వేలు, మేడిపల్లి గ్రామానికి చెందిన సెడ్మాకి భీంరావుకు రూ.12వేల నగదు ఇచ్చారు.

నేడు సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యములో గోలేటి టౌన్ షిప్ లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిభిరం నిర్వహించనున్నారు. ఆదివారం నిర్వహించే శిబిరాన్ని వినియోగించుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి కోరారు.ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించి దీర్ఘకాలిక వ్యాదులు కీళ్ళ , మోకాళ్ళ నొప్పులు, బీపీ, షుగర్ , పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి మందులు అందజేస్తారని తెలిపారు. ఉద్యోగులు, గ్రామస్తులు వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువకులు క్రీడల్లో రాణించాలి


నవతెలంగాణ-కౌటాల

యువకులు క్రీడల్లో రాణించాలని మాజీ ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి అన్నారు. క్రికెట్ టీం సభ్యులకు తన వంతుగా టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చేడు వ్యాసనాలకు అలవాటు పడకుండా ఉండాలంటే ఏదో ఒక పని మీద పట్టుదలతో ఉండాలన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించి మండాలానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆదాయం ఘనం..అభివృద్ధి శూన్యం

- కలగానే రెండు వరుసల రహదారి
- ఏండ్ల తరబడి అసౌకర్యాలతోనే జాతర నిర్వహణ
- అధికారులు దృష్టి సారించాలని భక్తుల విన్నపం



గంగాపూర్‌లో శ్రీవెంకటేశ్వర ఆలయం(ఫైల్)

నవతెలంగాణ-రెబ్బెన

శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ముగిసింది. ఆదాయంలో అద్భుతం కానీ అభివృద్ధిలో శూన్యమని చెప్పవచ్చు. రెండవ తిరుపతిగా పిలవబడే శ్రీ గంగాపూర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. జాతర సమయంలో సౌకర్యాలు సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారి పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈనెల 12 నుంచి 14వ తేది వరకు మూడు రోజుల పాటు జాతర వైభంగా సాగింది. జాతర సందర్భంగా ఆలయానికి దాదాపు రూ.44 లక్షల 7,333 వరకు ఆదాయం సమకురింది. ప్రతి ఏటా కూడా ఇలానే ఆదాయం పెరుగుతు వస్తున్న కూడా సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు.

అసౌకర్యాలే దర్శనం..

ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొనుటకు మన రాష్ట్రం నుండి కాకుండా అటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. కానీ వచ్చే భక్తులకు అసౌకర్యాలతో ఈ ఆలయం దర్శనమిస్తుంటాయి కనీసం భక్తులకు టాయిలెట్లు ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారి పూర్తిగా విఫలమయ్యారని అంటున్నారు. లక్షలాది మంది భక్తులకు 12 టాయిలెట్లు మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని ప్రజలు చెబుతున్నారు. మహిళలకు టాయిలెట్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వృద్ధులకు వికలాంగులకు స్వామివారిని దర్శించుకొనుటకు ఎలాంటి సదుపాయం కల్పించలేదు ఆలయం చుట్టూ ఉన్న ప్రసాదాల కౌంటర్ల వద్ద అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్న ఆలయ అధికారి ఈఓ మాత్రం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



ఇటీవల నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అభివృద్ధికి అమడ దూరం..

శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడ ఉన్న అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. వర్షాకాలంలో ఆలయానికి భక్తులు వెళ్ళటానికి ఫుట్ బిడ్జి లేకపోవడంతో భక్తులు వెనుక నుండి వచ్చి గుట్టలపై నుండి ఇబ్బందులు పడుతూ స్వామి వారిని దర్శించుకుంటారు. ఏండ్లు గడుస్తున్న స్వామిని సులభంగా దర్శించుకునేందుకు బ్రిడ్జి లేకపోవడం దురదృష్టకరమని ప్రజలు వాపోతున్నారు.

కలగానే రెండు వరసల దారి

మండలానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి పోవడానికి రెండు వరుసల రహదారి కలగానే మిగిలిపోయింది. ప్రతి సంవత్సరం శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరపడానికి సరిగా కల్యాణ మండపం లేక తాత్కాలిక మండపంలోనే కల్యాణం జరిపిస్తుంటారు. ప్రభుత్వాలు మారిన గంగాపూర్ ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో మాత్రం విఫలమయ్యారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దేవదాయ శాఖ మంత్రి ఉన్న ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో శ్రద్ధ వహించలేదని అపవదు మూటకట్టుకున్నారు. ప్రతి సంవత్సరం రాజకీయ నాయకులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తూ ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పటం తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు కూడా ఉన్నాయి. రెండు వరుసల రహదారి ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తారే తప్ప తర్వాత దీనిని పట్టించుకునే నాధుడే లేడు. ఈ రెండు వరుసల రహదారి ప్రతి సంవత్సరం భక్తులకు కలగాలని మిగిలిపోతుందని ప్రజలు అంటున్నారు.

కొట్టచ్చినట్టు కనిపించిన నిర్లక్ష్యం

స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం కనిపించిందని చెప్పవచ్చు. కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ప్రస్తుతం ఎండలు మండుతున్న గొంతు తడిపేందుకు చుక్క నీరు కూడా అందుబాటులో ఉంచలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి ఏటా ఆదాయం పెరుగుతున్న అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి సంవత్సరం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఈ సంవత్సరం పోలీస్ శాఖ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎక్కడ కూడా ట్రాఫిక్ లేకుండా సులభంగా పోయే విధంగా ఏర్పాటు చేశారు. వచ్చే సంవత్సరం జాతరలోపు రెండు వరుసల రహదారి, ఆలయానికి వెళ్లేందుకుక ఫుట్ బ్రిడ్జి నిర్మించి, వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



ఇటీవల గంగాపూర్‌లో శ్రీవెంకటేశ్వర ఆలయం జాతకు వచ్చిన భక్తులు

పదిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థుల తల్లితండ్రులు ఆ దిశగా దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని, ఆ దిశగా సహకరించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రతిరోజు ఇంటి నుండి వస్తుంటారని, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల జీవితాలలో 10వ తరగతి చాలా ముఖ్యమన్నారు. వార్షిక పరీక్షలకు ఇంకా 30 రోజుల సమయం మాత్రమే ఉందని, విద్యార్థులు ఇంటి వద్ద కూడా పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా చూడాలన్నారు. ఇంట్లో టెలివిజన్, మొబైల్ వాడకం తగ్గించాలని, పరీక్షల సమయాల్లో బయటకు తీసుకువెళ్లడం తగ్గించాలని, వ్యవసాయ, ఇతర పనులు అప్పగించడం చేయకూడదని తెలిపారు. విద్యార్థుల పురోగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవాలని, ప్రభుత్వం తరుపున జిల్లా యంత్రాంగం ప్రతి పాఠశాలలో విద్యారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అల్పాహారం, అదనపు తరగతులు నిర్వహించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురాకూడదని తెలిపారు. పది వార్షిక పరీక్షా ఫలితాలలో జిల్లాని ముందు స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గమానియల్, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ పాల్గొన్నారు.



సీసీఐ ద్వారా త్వరలోనే పత్తి కొనుగోళ్లు

- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీసీఐ ద్వారా త్వరలోనే పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఒక ప్రకటనలో సూచించారు. సాంకేతిక సమస్య కారణంగా గత వారం రోజులుగా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని, దీనిని ఆసరాగా తీసుకున్న దళారులు రైతుల నుండి తక్కువ ధరకు పత్తి కొనుగోళ్లు చేపడుతూ మోసం చేస్తున్నారని అన్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల స్థాయిలను తెలుసుకొని వాటిక అనుగుణంగా బోధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు రాబట్టేలా ఋషి చేయాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. జైనూరు మండలంలోని పానపటార్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వంటశాలతో పాటు ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను వివిధ అంశాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గణిత విషయంలో జరిగిన స్లిప్ టెస్ట్‌లో కాపీయింగ్ జరిగిందని గ్రహించి సదరు ఉపాధ్యాయునిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. పరీక్షకు ముందు విద్యార్థులను సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులకు గణితం బోధించే ఉపాధ్యాయున్ని పిలిచి విషయం వివరించమని అడగగా ఆయన సరిగ్గా వివరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటివి జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-రెబ్బెన

కుటుంబానికే పరిమితం కాకుండా మహిళలు నేడు అంతరిక్ష పరిశోధనల్లోనూ తమదైన ముద్ర వేస్తున్నారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఖైరిగూడ ఉపరితల గని వద్ద మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు ఉద్యోగోన్నతులు, హోదా గల ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికిక ఆయన ముఖ్య అతిదిగా హాజరై సింగరేణిలో ఉన్న పలు హోదా గల ఉద్యోగాలు, పదోన్నతుల కాల పరిమితి గురించి వివరించారు. 16 డిసిగ్నేషన్ల (హోదా ఉద్యోగాల)పై అవగాహన కల్పించారు. మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న డిసిగ్నేషన్ల ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపించడం జరుగుతుందని జీఎం తెలిపారు. గతంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆసక్తి తో దరఖాస్తు చేసుకున్న మహిళా ఉద్యోగులు ప్రస్తుతం ఎంవీటీసీ(గనుల వృత్తి శిక్షణ కేంద్రం)లో పంపు, కన్వేయర్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. పలు డిసిగ్నేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులను అభినందించారు. ఆసక్తి గల ఉద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమములో ఎస్ఓటూజీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డిప్యూటి పీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకుడు మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడ్ల పందేం పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని మొగడ్ దగడ్ గ్రామపంచాయతీలో శనివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ కమిటీ సభ్యులు ఎడ్ల పందేల పోటీలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న ఈ పోటీలను నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా ఈ పోటీల్లో ఔత్సహికకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ విగ్రహం వద్ద సంప్రదాయం పూజలు చేసి భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని అన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని వెల్లడించారు. దీంతో శ్రీ సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందిచల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ రాథోడ్ శంకర్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్, అనార్‌పల్లి మాజీ సర్పంచ్ శేషారావ్, సేవాలాల్ సేన మండల అధ్యక్షులు రమేష్, లాలు, శివ ప్రసాద్ లాలు పాల్గొన్నారు.



కెరమెరిలో..



బెజ్జూర్‌లో..

రెబ్బెన : ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించారు. సేవాలాల్ మహారాజు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.

బెజ్జూర్ : మండలంలోని లంబాడిగూడ గ్రామంలో సేవాలాల్ జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సంర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లంబాడీలకు సేవలాల్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సేవాలాల్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సపవత్ కేసునాయక్, సపవత్ బిక్షపతి, లకవత్ భూసింగ్, సపవత్ చిన్న, బనోత్ చింటూ, రోహిత్, సునీల్, తరుణ్ పాల్గొన్నారు.

నేటి మహా సమ్మేళనం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సరస్వతి శిశుమందిర్ ప్రారంభం 1979 నుండి విద్యనభ్యసించి పూర్తిచేసిన అందరు విద్యార్థులు ఒకే వేదికపై కలిసే విధంగా నేడు జిల్లా కేంద్రంలో మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శిశుమందిర్ కోటేశ్వర్‌తో పాటు నిర్వహణ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిశుమందిర్‌లో విద్య అభ్యసించిన ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చని తెలిపారు.

నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం | ఫిబ్రవరి 16, 2025 | www.navatelangana.com

వైద్య చికిత్సలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పేద ఆర్యవైశ్యునికి ఆస్పత్రి ఖర్చులకోసం రూ.54,800 ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. శనివారం పట్టణంలోని శివాలయం వీధిలో నివాసం ఉంటున్న ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన పద్మ లచ్చన్నకు ప్రమాదవశాత్తు వెన్నుముక పూర్తిగా పనిచేయడంలేదు. ఆర్థిక పరిస్థితి బాగలేక ఆర్యవైశ్య సంఘాన్ని సంప్రదించగా రూ.54,800 తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు నలమస్ కాంతయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యుల చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి నలమాసు శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం వికాస్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుకూరి రాజ్ కుమార్, చింతల రంజిత్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానంలో గురువారం అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ఈ మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పథకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ ఎం రాజా రమేష్ తెలిపారు. అండర్-14 విభాగంలో కె దీక్ష (ఏడవ తరగతి) త్రయాత్లోన్‌లో సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. అండర్-16 విభాగంలో ఓ రుచిత (9వ తరగతి) లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్‌ను గెలుచుకున్నారు. 400 మీటర్స్ పరుగు పందెంలోను, ఎం. సింధుజ (9వ తరగతి) బ్రాంచ్ మెడల్ సాధించారు. జావలిన్ త్రోలో బ్రాంజ్ ఓ. నిత్యశ్రీ (9వ తరగతి) బ్రౌజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు వి మల్లేష్ యాదవ్, ఎస్ సంతోష్ యాదవ్ అభినందించారు.

డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సూర్యనారాయణకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సూర్యనారాయణను శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్, ఏరియాలోని అన్ని గనుల విభాగాల అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా నిర్దేశిత లక్ష్యాల సాధనలో తమ వంతు పాత్ర వహించి సింగరేణి సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సూర్యనారాయణ ఆదర్శప్రాయులని తెలిపారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని, ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి 8 గంటలు విధులు నిర్వహించి సంస్థ నిర్దేశిత లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వరరెడ్డి, ఏజెంట్లు కూర్మ రాజేందర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్ కుమార్, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

'పరీక్ష సమయాల్లో ఆందోళనకు గురికావద్దు'



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళనకు గురికావద్దని, అప్పుడే అద్భుతంగా పరీక్షలు రాయగలరని కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ మోటివేషనల్ కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బాణావత్ ప్రకాష్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల(బాలికలు)లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మనసును అనవసరమైన విషయాల వైపు కాకుండా పరీక్షల వైపు కేంద్రీకరించాలని అన్నారు. యోగ ధ్యానం చేయడంవల్ల మనసు కుదుటపడుతుందన్నారు. సెల్ ఫోన్స్, టీవీ, కంప్యూటర్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కనీసం ఆరు గంటలు నిద్ర పోవాలన్నారు. రాత్రి ఎక్కువ మెలకువతో ఆందోళనకు గురికావల్సి వస్తుందని తెలిపారు. ఆహార నియమాలు పాటించాలన్నారు. కూరగాయల భోజనం పాలు పెరుగు, తగినంత నీరు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్ల రామన్న, సుధాకర్, ఉపాధ్యాయురాళ్ళు పద్మజ, రజిత, లక్ష్మి, కమల, చౌహాన్ కాంత, శంకరమ్మ స్రవంతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థి దశను ఉండే బ్యాంకింగ్‌కు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై అవగాహన ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉండే బ్యాంకులలో పొదుపు ఖాతాల గురించి, టర్మ్ పాలసీల గురించి, ఫిక్స్ డిపాజిట్, ప్రధాన మంత్రి సురక్ష భీమ యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన లాంటి పలు పథకాల గురించి ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా చక్కగా వివరించారు.. బాలికల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సుకన్య సమద్ధి పథకం ఎలా ప్రారంభించాలి, వడ్డీ శాతం, కాల పరిమితి, ఉపసంహరణ, ముగింపు తదితర అంశాలను చక్కగా వివరించారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్, ఉపాధ్యాయ బందం తదితరులు పాల్గొన్నారు.

ఒమాన్ నుంచి స్వగ్రామానికి చేరిన మల్లేష్ మృతదేహం

నవతెలంగాణ-జన్నారం



ఇటీవల మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం మల్లేష్, ఒమన్ దేశంలో విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందాడు. అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంలో గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి నాయకులు కృషి చేశారని మండల గల్ఫ్ సంక్షేమ సమితి మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగుండ తిరుపతి, తెలిపారు. మృతదేహం ఇండియాకు రావడానికి సహకరించిన, జనుగురి శంకర్, తుడుం సూరయ్య, జునుగురు రాజన్న, జునుగురు సందీప్, జాడి సత్యనారాయణ, సోగుల లింగన్న, జాడి వెంకటేష్, బల్లా రవి, తాళ్ల పెల్లి రమేష్, గుమ్మల రవి, ఒమంప్రకష్, ప్రత్యేకంగా సాయపడ్డారని వారు తెలిపారు. మల్లేష్ పార్థివదేహం స్వదేశానికి రాగానే, విమానాశ్రయం నుంచి స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు మంద భీమ్‌రెడ్డి ప్రభుత్వ ఉచిత అంబులెన్స్ సౌకర్యం అందించేందుకు సహాయపడ్డారన్నారు.

నిరుపయోగం ఎత్తిపోతల పథకం

- దొగతననానికి గురవుతున్న విలువైన పరికరాలు
- మూడేండ్లుగా ముందుకు సాగని పంట సాగు
- పట్టించుకోని సంబందిత అధికారులు
- సీపీఐ(ఎం) నాయకుల పర్యటనతో బయటపడ్డ లోటుపాట్లు

నవతెలంగాణ-జైపూర్



కోటపల్లి మండల కొల్లూరు, బోరంపల్లి ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. ఆ పథకానికి సంబంధించి రూ.లక్షలు విలువ చేసే పంపు సెట్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బోరంపల్లి, కొల్లూరు శివారు పంటలకు సాగు నీరు అందక మూడేండ్లుగా పంటల సాగు చేయడంలేదు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, ఐఆర్‌సీపీ నాయకుడు జయరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి పర్యటించారు. సాగు నీరు అందక పోవడానికి గల కారణలపై ఆరా తీయగా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో రైతాంగానికి సాగు నీరు అందడం లేదని స్పష్టమైదని నాయకులు తెలిపారు. సాగు నీటి సమస్యను తీర్చడం కోసం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం పంపు సెట్లు మాయమవుతుండగా షెడ్డు మాత్రమే మిగిలింది. 1745 ఎకరాలకు సాగు నీరు సమకూర్చడం కోసం 2009 సంవత్సరంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసిన అధికారులు నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోందని అన్నారు. రూ. 614.40 లక్షలతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పతకం 2020 సంవత్సరంలో ప్రాణహిత నది బ్యాక్ వాటర్ ముంపు గురికావడం రైతులకు శాపంగా మారిందని తెలిపారు. నీటిలో మునిగిన పంపు సెట్లు మరమ్మత్తులు చేపట్టక నిర్లక్ష్యంగా వదిలేయడాన్ని ఆసరగా తీసుకున్న దొంగలు విలువైన పంపు సెట్లు మాయం చేస్తూ వస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా రైతులకు సంబంధించి వ్యక్తిగత విద్యుత్ మోటర్లు, సోలార్ బ్యాటరీలు దోపిడి చేస్తున్నందున గత మూడు సంవత్సరాల నుంచి పంటల సాగు ముందుకు సాగడం లేదు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. వ్యవసాయ పరికరాలు, పంట క్షేత్రాల్లో నిల్వ చేసుకున్న మిర్చి బస్తాలను కూడా వదల కుండా దోచుకుపోతుండటంతో పంటలు సాగు చేయడం సమస్యగా మారిందని బాధితులు పేర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడీతండా(కె) గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్, జిల్లా లంబాడ జేఏసీ అధ్యక్షుడు సభావత్ శంకర్ ఆధ్వర్యంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. సోమగూడెం రహదారి పక్కనే సేవాలాల్ జెండా ఎగర వేశారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల లంబాడ జేఏసీ అధ్యక్షులు సభావత్ శంకర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధించిన సన్మార్గంలో యువత అందరూ చదువుకొని ముందుకు వెళ్లాలన్నారు. సేవలాల్ మహారాజ్ భజన కార్యక్రమం నిర్వహించి హిత బోధనలు చేశారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సభావత్ శంకర్, తండా నాయక్, అజ్మీర శ్రీనివాస్, సపాట్ చందు, అజ్మీర శ్రీనివాస్, అజ్మీర తారు, బానోత్ పరశురాం, బోడ బలరాం, మహిళలు రాజేశ్వరి, స్వప్న, సుజాత పాల్గొన్నారు.

ధర్మారావుపేట లంబాడీతండాలో..

ధర్మారావుపేట లంబాడీతండాలో మాజీ సర్పంచ్ సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా గౌరవ అధ్యక్షులు ధరావత్ కైలాష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

జన్నారంలో మాజీ ఎమ్మెల్యే రాఖానాయకర్

జన్నారం : బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాలలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ పాల్గొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని సేవాలాల్ చౌక్ వద్ద ఆమె శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. సర్వ మానవాళి శ్రేయస్సు కోసం సేవాలాల్ బోధనలు చేశారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్ లకావత్ తిరుపతి, సేవాలాల్ కమిటీ సభ్యులు సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావును కలిసిన హెచ్ఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. శనివారం ఎస్టీపీపీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్‌రావును కలిసిన ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వివరించారు. గతంలో పవర్ ప్లాంట్ నిర్వాహణ చేపట్టిన స్టీగ్ సంస్థ ఇప్పటి వరకు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంలేదని తెలిపారు. ఫస్ట్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ చేయించాలని కోరారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ స్థానికులైన నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ ఆగడాలని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో తొలిగించిన కార్మికులను వెంటనే ఉద్యోగాల్లోకి తీసకోవాలని డిమాండ్ చేశారు. పపవర్‌మేక్ కంపెనీ 2016 నుండి 2025 వరకు 8.33 శాతం బోనస్ కార్మికులకు చెల్లించాలని ఈడీ దృష్టికి తీసుకొచ్చారు. ప్లాంట్‌లో జరుగుతున్న ప్రమాదాలు నైపుణ్యం ఉన్న ఇంజనీర్లు లేకపోవడమే అన్నారు. స్థానికేతరులు అనుభవం లేనటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా స్థానికులైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు.



కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, అనిల్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నవీన్, ప్రచార కార్యదర్శి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దళారుల చేతిలో మోసపోతున్న పత్తి రైతులు



నవతెలంగాణ-జైపూర్

పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. సీసీఐ కొనుగోళ్ళ నిలిపివేయడంతో దళారులు రంగ ప్రవేశం చేసి రైతులను నిండా ముంచుతున్నారని అన్నారు. చెన్నూర్ పట్టణంలోని జిన్నింగ్ మిల్ వద్ద పత్తి రైతులతో మాట్లాడిన సీపీఐ(ఎం) నాయకులు పత్తి రైతులకు న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. దళారులను కాపాడుకోవడం కోసం సీసీఐ ద్వార కొనుగోళ్లు నిలిపివేయడమేనని అన్నారు. పత్తి పంటను అమ్ముకోవడం కోసం రైతులు రాత్రింబవళ్లు జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. పద్మనగర్ వద్ద పత్తి మిల్లులో అమ్మడానికి వచ్చిన రైతుల వివరాలు సేకరించిన నాయకులు గత 15 రోజులుగా పత్తి అమ్ముకోవడం కోసం ఇక్కడి మిల్ వద్ద వేచి చూడాల్సివస్తోందని తెలిపారు. పత్తి లోడ్ చేసిన వాహణాలకు వేటింగ్ చెల్లించడమే కాకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పది రోజుల నుండి జిన్నింగ్ మిల్లు వద్ద ఉండిపోవల్సి వచ్చిందని ఆవేధన వ్యక్తం చేశారు. సీసీఐ ద్వార కొనుగోల్లు నిలిపివేయడంతో దళారులు రూ. 6 వేల నుండి రూ. 6,600 ధరతో అమ్ముకోవల్సిన పరిస్థితుల్లో ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్యామల, ఉమారాణి, సిడం సమ్మక్క, రాతిపల్లి నగేష్, బోయరి రమాదేవి, భూర్తి వెంకటస్వామి, జిమిడి శ్రావన్, గోగు సురేందర్ పాల్గొన్నారు.

ఉజ్వల హైస్కూల్లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఉజ్వల హై స్కూల్‌లో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుండి 10వ తరగతి విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల వంటకాలను వారు స్వయంగా తయారు చేసి వాటిని ప్రదర్శించి విక్రయించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో తెలంగాణ వంటకాలైన రాగి లడ్డు, జొన్న అంబలి, చిరుధాన్యాల ఇడ్లీ, భోజనాలతో పాటు, పలు రకాల జ్యూస్, మహారాష్ట్ర, బీహార్, ఆంధ్రప్రదేశ్ వంటకాలు సందర్శకుల నోరూరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఏ పని చేయాలనుకున్నారు. అలాగే వ్యాపారం చేసే విధానం అందులో లాభనష్టాలను గురించి తెలియజేయడమే ఈ ఫుడ్ ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు.



వేలాల జాతరలో ఆటోలకు అనుమతి

- పోలీస్‌స్టేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

వేలాల మల్లిఖార్జున స్వామి జాతరలో ఆటోలు నడిపేందుకు అనుమతి ఇస్తున్నామని, ఆటో డ్రైవర్లు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్ఐ శ్రీధర్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం పట్నాలు వేసుకునే భక్తులకు అదనంగా పట్నాల గద్దెలు నిర్మాణ పనులను శనివారం ఎస్ఐ పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని అదనపు సౌకర్యాలపై పోలీస్ శాఖ దృష్టి సారించిందని తెలిపారు. గట్టుమల్లన్న ఆలయ ప్రాంగణంలో పట్నాలు వేసుకోవడంలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వల్ల పట్నాల గద్దెను పెంచి నిర్మిస్తున్నట్లు తెలిపారు. తొక్కిసలాట జరుగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పార్కింగ్ ఏరియా చదును చేయించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. అదే విధంగా మహా శివరాత్రి సందర్భంగా గట్టుమల్లన్న సన్నిధిలో జాగరణ చేయడం కోసం తరలివచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటో, డ్రైవింగ్ లైసెన్స్‌తో జైపూర్ పోలీస్ స్టేషన్‌లో పూర్తి స్థాయి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నూతన విద్యా విధానాలకు అనుగుణంగా బోధించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు ఆయన శనివారం బెల్లంపల్లి సెంట్ మేరీస్ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న సంకేతిక పరిజ్ఞానంతో విద్యా విధానంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. విద్యార్థుల ఆశయాల కనుగుణంగా విద్యాబోధన చేసి వారి భవిష్యత్తు బాటలు వేయాలని సూచించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా నైపుణ్యతతో కూడిన విద్యాబోధన ఉండాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించే విద్యాసంస్థలకు ప్రభుత్వం సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు బాల్యంలో చేసే విద్యాబోధన దేశ భవిష్యత్తుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ప్రెసిడెంట్ ఆఫ్ సీఎంఐ సర్వీస్ సొసైటీ హైదరాబాద్ రెవరెండ్ ఫాదర్ ఫిలాక్స్ అలెక్స్, మంచిర్యాల సీఎంఐ ఎడ్యుకేషనల్ సొసైటీ కౌన్సిలర్ రెవరెండ్ ఫాదర్ జీన్స్, కరస్పాండెంట్ ఫాదర్ జెక్ పాల్గొన్నారు

పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను శనివారం విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీ బృంద సభ్యులు సిరంగి సుదర్శన్, బండారి శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి నిర్మాణాత్మక సంగ్రహణాత్మక అంశాలను ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గం చిన్నయ్యకు పత్రాన్ని అందజేశారు.

స్థానిక సంస్థల తుది ఓటరు జాబితా విడుదల



నవతెలంగాణ-తాండూర్

ఎంపీటీసీ జడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాల ఓటర్ తుది జాబితాను శనివారం ఎంపీడీఓ మహేందర్ కార్యాలయంలో ప్రదర్శించారు. అభ్యర్థులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఓటర్లు జాబితాలో ఆక్షేపణలు తప్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. తుది జాబితాను మండలంలోని గ్రామపంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. ఫిర్యాదులుంటే స్వీకరిస్తామని తెలియజేశారు. ఆయనతో ఎంపీఓ శ్రీనివాస్, సూపర్డెంట్ వేణు ఉన్నారు.

సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ద్వారా కంటి బాధితులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ సూచించారు. ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన వారిని శనివారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి క్యాటరాక్ట్ ఆపరేషన్ల నిమిత్తం పంపించారు. ఈ సందర్భంగా వారికి రవాణ, భోజన సదుపాయం కల్పించిన అనంతరం వారితో కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా తమ సొసైటీ ఆధ్వర్యంలో వేల మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం ఇన్‌ఛార్జి గోపితో పాటు కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో వసూళు చేయాలి

నవతెలంగాణ-వాంకిడి



గ్రామపంచాయతీలో అన్ని రకాల పన్నులను సకాలంలో వంద శాతం వసూళు చేయాలని డీపీఓ భిక్షపతి గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఆయా అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల చివరిలోగా వంద శాతం టాక్స్ కలెక్షన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ, సానిటేషన్, టాక్స్ కలెక్షన్‌పై జీపీల వారీగా సమీక్ష నిర్వహించి పురోగతిని తెలుసుకున్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఖాజా అజీజోద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పూడ్చి వేత



నవతెలంగాణ-కౌటాల

పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడానికి ప్రభుత్వం బియ్యం సరఫరా చేసింది. కరోనా సమయంలో మిగిలిన బియ్యం మండల విద్యా వనరుల కేంద్రంలో ఉంది. దీంతో వాటికి పురుగులు పట్టి తినడానికి పనికి రాకుండా ఉండడంతో ఎంఈఓ గావుడె హనుమంతు ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి వాటిని గోతి తవ్వి పూడ్చి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. కరోనా నాటి బియ్యాన్ని అధికారుల ఆదేశానుసారం తహసీల్దార్ ఇందారపు పుష్పలత, ఎంపీడీఓ కోట ప్రసాద్‌తో కలిసి పంచనామా చేసి వాటిని పూడ్చి వేసినట్లు ఎంఈఓ తెలిపారు.

శ్రామినేర్ శిబీర్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-వాంకిడి

మార్చ్ 3 నుండి 9 వరకు నిర్వ హించే బౌద్ధ దమ్మ దీక్ష శ్రామినేర్ శిబిర్ పోస్టర్లను శనివారం మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ సంఘం నాయకులు విడుదల చేశారు. భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ యువజన సంఘం, సిద్దార్థ యువజన సంఘం, రమాబాయి మహిళ మండలి ఆధ్వర్యంలో ఏడు రోజులు శ్రామినేర్ శిబిర్ కొనసాగుతుందనీ భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని నాగపూర్ చెందిన బౌద్ద గురు బాదంతే భిక్షు దమ్మా సారథి బృందం ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు దీక్ష శిబిరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షులు ఉగ్రే జైరాం, అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షులు దుర్గం హంసరాజ్, సమతా సైనిక్ దళ్ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్, సమాజ అధ్యక్షులు విలాస్, రాజేంద్ర ప్రసాద్, నాయకులు రోషన్, విజయ్, శ్యామ్ రావు పాల్గొన్నారు.

అటవీ పంది దాడిలో యువకుడికి గాయాలు

నవతెలంగాణ-బోథ్

అటవీ పంది దాడిలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని గుట్టపక్క తండ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... సొనాల పెట్రోల్ పంపుకు వెళ్తున్న క్రమంలో బ్రిడ్జి పక్కన ఒకే సారి అటవి పంది దాడి చేసిందన్నారు. బాధితుడు కేకలు వేయడంతో పక్కన ఉన్నవారు సంఘటన స్థలానికి రావడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాని తెలిపారు. ఇలా రోడ్డుపై అటవీ పందులు వచ్చి దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రెడ్డి ఐక్య వేదిక యూత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సవీన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెడ్డి ఐక్య వేదిక యూత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గోమత సేవ సమితి సభ్యుడు, గోపిడి సవీన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యూత్ అధ్యక్షులు ఎలిమినేటి సుమన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాతం శివ ప్రసాద్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడంతో ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. దీంతో సవీన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, తనను రెడ్డి రాష్ట్ర ఐక్యవేదిక యూత్ ప్రచార కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఎలిమినేటి సుమన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని సుంకిడి పోచమ్మ ఆలయాన్ని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేకత గురించి, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం గ్రామస్తులు ఒకేరోజు కులమత తారతమ్యాలు, బేధాలు లేకుండా కలిసి మొక్కలు తీర్చుకోవడం పట్ల గ్రామస్తులను అభినందించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, తోట వెంకటేష్, ఆశన్న యాదవ్, తోట ప్రమోద్, జక్కుల శ్రీనివాస్, జాదవ్ అజయ్, సుంకిడి గ్రామస్తులు ఉన్నారు.

ముగిసిన మల్లన్న జాతర

ముథోల్ : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుని జాతర ఈ నెల 11న ప్రారంభమైన జాతర శనివారం నాటికి అంబలి కుండా ఇంటికి తేవడంతో ముగిసింది. ముగింపు సందర్భంగా భక్తులు తరలి వచ్చి మల్లన్నదేవున్ని దర్శించుకున్నారు. అనంతరం మహిళ భక్తులు జాతర ముగింపు సందర్భంగా గాజులు కొనుగోలు చేశారు. మల్లన్న జాతరలో గాజులు కొనుగోలు చేయడం ద్వారా ఇంటి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్మకం. అంతే కాకుండా సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండా ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి సంఘటనలు జరుగకుండా సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్, అశోక్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

కేంద్ర నిధులకు నివేదికలు తయారు చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆస్పిరేషన్ జిల్లాలో భాగంగా వస్తున్న నిధులకు అవసరమైన నివేదికలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఆస్పిరేషన్ జిల్లా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు రూ.మూడు కోట్ల నిధులు కేంద్రాల నుండి రానున్నాయని తెలిపారు. వీటికి సంబంధించి నివేదికలు రూపొందించాలన్నారు. పనులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, యువత, నిరుద్యోగ యువకులకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్డ్ యూనిట్ సెంటర్ ఏర్పాటు, మారుమూల గ్రామాలకు అంబులెన్స్ సర్వీస్, యానిమల్ బర్త్ సెంటర్, గురుకుల పాఠశాలలలో శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనుల సంబంధిత అంచనాలతో నివేదిక రూపొందించాలన్నారు. సమర్పించిన నివేదికకు అవసరమైన అనుమతులు పొందాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన తర్వాత పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాలలో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఆడెపు భాస్కర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, డీఈఓ గమీనియల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం సమన్వయకర్త మణివేలు పాల్గొన్నారు.

సేంద్రీయ సబ్బుల వాడకంతో ఆరోగ్య పరిరక్షణ

- జాతీయ హరితదళం రాష్ట్ర కో ఆర్డినేటర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సేంద్రీయ సబ్బుల వాడకంతో ఆరోగ్యం పరిరక్షించబడుతుందని జాతీయ హరితదళం రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణం సర్‌సిల్క్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఆరు నుండి పదో తరగతి విద్యార్థులకు కార్యశాల నిర్వహించారు. పర్యావరణహితమైన సబ్బు, హ్యాండ్‌వాష్, డిష్‌వాష్‌ల తయారీపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలలో కాలుష్యం అతిపెద్ద సమస్యగా మారుతోందని అన్నారు. కృత్రిమ రసాయనాల ద్వారా తయారయ్యే సబ్బుల నుండి సమాజాన్ని రక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి దేవాజీ మాట్లాడుతూ కార్యశాలల నిర్వహణ ద్వారానే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించగలుగుతామని అన్నారు. ఈ



కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఆరు గ్యారంటీల అమలుకు ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో చలో హైదరాబ్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే వందరోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి14 నెలలైనా అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హామీల అమలుకు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు నాగేష్, రవి, రమేష్, పోసన్న, సాంబయ్య పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటిలోని సివిల్ కార్యాలయ ఆవరణలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బండారి తిరుపతి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి14 నెలలు అయిన పూర్తిగా చేయలేదన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షకార్యదర్శిలు అరికిళ్ల పోశం, గోలేటి శ్రీనివాస్, నాయకులు చందు, భీమేష్, నరేష్, శేఖర్, బి.లక్ష్మి, ఈశ్వరి, తార, భాగ్యలక్ష్మి, శంకరమ్మ, కవిత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తో కోర్టు కేసుల రికార్డులు భద్రం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోర్టులోని కేసుల రికార్డులను భద్రంగా ఉంచడానికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు డిజిటలైజేషన్ చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి, పలు సూచనాలు చేశారు. కోర్టులో రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు డిజిటలైజేషన్ చేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు మ్యాన్యువల్‌గా ఉన్న రికార్డులను కంప్యూటరీకరిస్తూ వాటిని భద్రపరుస్తున్నామన్నారు. ఎప్పటికైన సులభంగా లభించేలా పొందుపరుస్తున్నామని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో డిజిటలైజేషన్ కేంద్రాలకు భవనాలు లేవని, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ వారి భవనాన్ని ఇవ్వడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఇలానే సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీల జైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య,



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సీఆర్పీలకు నివాళి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలోని చేగుంట మండలంలో పనిచేస్తున్నటువంటి ఇద్దరు సీఆర్పీలు నిన్న రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట వారి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు భూసారపు గంగాధర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు గాంధారి రత్నం, గజేందర్ సింగ్, లింగన్న, భోజన్న, గంగన్న, వెంకట్, విఠల్, రవీందర్, నరేష్, సంగీత, సాల్మన్ నాయక్, రాము, నరేష్, రాజేశ్వర్ రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

పట్టభద్రుల సమావేశం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లోని చంద్రశేఖర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం 11 గంటలకు ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గాల సమావేశానికి రాష్ట్ర మంత్రి సీతక్క, కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి హజరవుతారని తెలిపారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు

నవతెలంగాణ-నార్నూర్

అర్హులైన వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని సావిరి గ్రామపంచాయతీలో అధికారులతో కలిసి మొదటి దఫాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించేందుకు కొలతలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు డీఈ శివప్రసాద్, ఏఈ రాథోడ్ సునీల్, ఎంపీఓ రమేష్, ఆర్ఐ తిరుపతి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

నిర్మల్‌టౌన్ : నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్మల్ ప్రభారి రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు వినీత్, రాష్ట్ర బీజేవైఎం సెక్రటరీ అరవింద్ హాజరై ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు మెడిసెమ్మ రాజు, వొడిసెల అర్జున్, కౌన్సిలర్లు అయ్యన్నగారి రాజేందర్, నరేందర్, నవీన్, సాయి, కార్తీక్ పాల్గొన్నారు.

అధికారులకు చెప్పి.. విసుగు చెంది..

- రోడ్డుపై గుంతలను తానే పూడ్చుకున్న మాజీ కౌన్సిలర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తనింటి ముందున్న రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, నూతన రోడ్డు మంజూరు చేయకపోయినా కనీసం ఆ రోడ్డుపైనున్న గుంతలనైనా పూడ్చాలని ఆ మాజీ కౌన్సిలర్ మున్సిపల్ అధికారులకు చెప్పి, చెప్పి విసుగు చెందింది. అయినా పని కాకపోవడంతో చివరికి రోడ్డుపైనున్న గుంతలను తానే మట్టితో పూడ్చుకుంది. కాగజ్‌నగర్ పట్టణం కాపువాడకు చెందిన మాజీ కౌన్సిలర్ దెబ్బటి తార ఇంటిముందున్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నూతన రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులను గత కొన్నేళ్లుగా కోరుతూ వస్తోంది. అయినా స్పందన లేకపోవడంతో కనీసం గుంతలనైనా పూడ్చాలని ఆమెతో పాటు కాలనీవాసులు అధికారులను కోరారు. అయినా ఫలితం లేకపోవడంతో విసుగు చెందిన ఆ మాజీ కౌన్సిలర్ శనివారం మున్సిపల్ అధికారుల పనితీరును విమర్శిస్తూ తన ఇంటిముందున్న గుంతలను తానే మట్టితో పూడ్చుకోవడం గమనార్హం.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని మారుమూల ప్రాంతాలకు తాగునీరు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ నాయకులు గొడిసెల కార్తీక్, గేడం టికానంద్ కోరారు. శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఎండాకాలం ప్రారంభమైందని, ప్రజలు చాలా దూరం నుండి కాలినడకన వెళ్లి తాగునీరు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అలాగే గోవెన, చెలిమెల, కొర్లంక గ్రామాలలో నీటి కష్టాలు చాలా ఉన్నాయన్నారు. తహసీల్దార్ సూర్యప్రకాష్ స్పందించి మండలంలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలు నీటి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందించే విధంగా చూస్తామని చెప్పారన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులకు లోబడి 2008 డీఎస్సీలో ఎంపికైన 30 మంది అభ్యర్థులకు గాను 28 మంది అభ్యర్థులకు జిల్లా విద్యాధికారి గమినియల్ పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2008లో ఎంపికైన 30 మందిలో 28 మందికి కాంట్రాక్టు ప్రాతిపదికన ఎస్జీటీలుగా విధులు నిర్వహించడానికి పోస్టింగ్ ఆర్డర్లు అందజేసినట్లు తెలిపారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

వాహన పత్రాలు కలిగి ఉండాలి

నవతెలంగాణ-కుభీర్

వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని బైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక వాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలని అన్నారు. వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, ట్రిపుల్ రైడింగ్ చేయకుండా ఉండాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఆయన వెంట కుభీర్ ఎస్సై రవీందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డయాగ్నొస్టిక్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

డయాగ్నొస్టిక్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల హన్మంతు, జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు తన్నీరు వెంకట్‌రావు, వకీల్, ముత్యం, ప్రవీణ్, వెంకటస్వామి, వెంకటరమణ, సాగర్ పాల్గొన్నారు.

అభిమానంతో మనువడికి కేసీఆర్ పేరు

నవతెలంగాణ-ఇచ్చోడ

కేసీఆర్ మీద తనకున్న అభిమానంతో తమ మనువడికి కేసీఆర్ అని పేరు పెట్టారు. మండలంలోని ముక్రా(కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి సుభాష్ ఇటీవల జన్మించిన మనువడికి తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పేరును పెట్టారు. ఈ సందర్భంగా గాడ్గే సుభాష్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం, మనుమడు నామకరణం మహోత్సవం ఒకే రోజు రావడం, కేసీఆర్ పేరును మనువడికి కేసీఆర్‌గా పేరు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా గల్ఫ్ కార్మికులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలం చిట్యాల్ గ్రామంలో ఇటీవల హత్యకు గురైన అడ్డిగ రిషి అనే బాలుడు కుటుంబానికి గల్ఫ్ కార్మికులు అండగా నిలిచారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న గల్ఫ్ కార్మికులు శనివారం రూ.17వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా నామత్కార్ గంగాధర్ కుటుంబానికి రూ.10వేలు అందించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇందులో రమేష్, సురేష్, లక్ష్మణ్, రవి, లింగన్న ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్‌ విఫలం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం చెందిందని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ(ఎం) మండల శాఖ సమావేశం నిర్వహించారు. మండల నాయకులు కొండగొర్ల లింగన్న అధ్యక్షతన వహించగా సంకె రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తామని, గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం, వాటిని అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. ప్రభుత్వం, ప్రతిసారి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకోవడమే తప్ప వాటిని పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటివరకు పేద ప్రజలకు పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, భూమి పట్టాలు, వంట గ్యాస్‌కు రూ.500 ఇస్తున్నామన్న మాట అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం ప్రజల వద్ద నుంచి దరఖాస్తుల మీద దరఖాస్తులు తీసుకొని వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అలాగే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు కోత విధించిందన్నారు. అలాగే



దళితుల సంక్షేమం కోసం, కేటాయించాల్సిన బడ్జెట్‌లో కోత విధించింది గుర్తు చేశారు. పేద ప్రజలకు కేటాయించాల్సిన నిధులను, ఈ దేశాన్ని దోచుకు తినే ఉన్నత వర్గాలకే కేటాయించిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్‌ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలపై సీపీఐ(ఎం) పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కనికారం అశోక్‌, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్లా, నాయకులు అంబటి లక్ష్మణ్‌, రాజన్న, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ, శంకర్‌ పాల్గొన్నారు.

40 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 40 పడకల కమ్యూనిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని వివిధ కుల సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయం కల్పించేందుకు కమ్యూనిటీ ఆస్పత్రి అవసరమని అన్నారు. మండల సమీపంలోని కడెం, దస్తురాబాద్‌, దండేపల్లిలోని అనేక గ్రామాలకు కేంద్రంగా ఉన్నాయని మండలాలలో ఎక్కువ మంది గిరిజన దళిత వెనుకబడిన కులాల పేద ప్రజలు ఉన్నారని తెలిపారు. వైద్యం కోసం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల, జగిత్యాల, నిర్మల్‌, ఆదిలాబాద్‌కు వ్యయ ప్రయాసలకు ఓర్చ వెళుతున్నారన్నారు. ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో సుమారు లక్షమందికి వైద్య సదుపాయాలు చేరువవుతాయని అన్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్‌ శ్రీ రామోజు కొండయ్య, కోకన్వీనర్‌ కోడూరి చంద్రయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, కడార్ల నర్సయ్య, మూల భాస్కర్‌గౌడ్‌, కుంట మహేష్‌, అడ్డగూరి భూమన్న, కోడి జుట్టు రాజయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ నేరడిగొండ మండల కమిటీ రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

ఎమ్మార్పీఎస్‌ నేరడిగొండ మండల కమిటీని సంపూర్ణంగా రద్దు చేస్తున్నట్టు ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షులు మల్లేష్‌ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్‌ ఆదేశాలు పాటించకుండా ఉద్యమ లక్ష్యానికి, స్ఫూర్తికి, విరుద్ధంగా స్వార్థపూరిత ఆలోచన వైఖరితో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షులు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శాశ్వతంగా ఉద్యమం నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. ఇక నుంచి జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్‌ ఉద్యమంలో జాతి కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ నిక్కార్సైన కమిట్మెంట్‌ నాయకులుగా ఎదగాలి కానీ, జాతి పేరుతో చలామణి అవుతూ, ఇతర రాజకీయ పార్టీల, కొమ్ము కాసే విధంగా వ్యవహరించే వారిపట్ల తీవ్రమైన కఠిన చర్యలు, ఉద్యమ స్వభావాన్ని బట్టి తీసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. తదుపరి ఉద్యమ సీనియర్‌ నాయకుల సూచనతో అన్ని గ్రామ కమిటీల అధ్యక్షులతో నూతన ఎమ్మార్పీఎస్‌ నేరడిగొండ మండల కమిటీని త్వరలో ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇంటి పన్నులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-తాంసి

మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు తమ ఇంటి ఆస్తి పన్నులను గ్రామపంచాయతీ కార్యదర్శులకు సకాలంలో చెల్లించాలని ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తమ మండల పరిషత్‌ కార్యాలయానికి సంబంధించిన ఆస్తి పన్నును చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన నివాస, ఆస్తి పన్నులను ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులకు చెల్లించి, రశీదు తప్పకుండా తీసుకొని సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీలో కార్యదర్శులు కారోబారిలు ఇంటింటికి తిరుగుతూ పన్నులను వసూలు చేస్తున్నారన్నారు. 50శాతం పన్నులు పూర్తి చేసినట్టు తెలిపారు.

విద్యార్థి దశ నుంచి ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాలి

నవతెలంగాణ-బోథ్‌

చదువుకునే విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాలని, ప్రధానోపాధ్యాయులు గెడం చందన్‌ అన్నారు. శనివారం సొనాల మండలంలోని పార్డి(బి) ఆశ్రమ బాలుర పాఠశాలలోని ఆర్బీఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత సంస్థ ద్వారా విద్యార్థులకు ఎన్‌సీఎఫ్‌ఈ, నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ ఫైనాన్షియల్‌ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులలో అందించే సేవలు అకౌంట్‌లలో వివరాలు ఇన్సూరెన్స్‌ సౌకర్యంతో పాటు పొదుపు చేస్తే కలిగే లాభాలను ప్రొజెక్టర్‌ ద్వారా వివరించారు. ఆర్థిక అక్షరాస్యత ద్వారా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కౌన్సిలర్లు సంతోష్‌, పెందూర్‌ దంజీ, అరవింద్‌గౌడ్‌, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో డంప్‌ యార్డ్‌ పెట్టింది ఎవరు..?

- మాజీ ఎమ్మెల్యే వేంపల్లికి చేసిందేమీ లేదు
- వేంపల్లి, ముల్కల కాంగ్రెస్‌ నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్‌



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గతంలో దళితుల భూముల్లో డంప్‌ యార్డ్‌ ఎవరు ఏర్పాటు చేశారని కాంగ్రెస్‌ నాయకులు ప్రశ్నించారు. శనివారం మండలంలోని వేంపల్లి ఓ ప్రయివేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేంపల్లి మాజీ ఎంపీటీసీ డేగ బాపు, చింతపండు శ్రీనివాస్‌ ఐటీ ఇండస్ట్రియల్‌ హబ్‌కు భూములు ఇచ్చిన రైతులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దళితులపై ప్రేమ వుంటే గతంలో దళితుల భూముల్లో 22 ఎకరాలు మంచిర్యాల మున్సిపాలిటీకి సంబంధించి డంప్‌ యార్డ్‌ను ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. డంప్‌ యార్డ్‌ వద్దని గ్రామ ప్రజలు సొంత ఖర్చులతో కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇవడంతో డంప్‌ యార్డ్‌ ఆగిపోయిందని తెలిపారు. దివాకర్‌రావు హయాంలో దళితులకు భూమిలిచ్చి డంప్‌ యార్డ్‌ ఏర్పాటుతో ఆ భూములకు పరిహారం చెల్లించకుండానే లాక్కునే ప్రయత్నం చేయలేదా అని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌ సాగర్‌ రావు చేస్తున్నా అభివృద్ధిని చూసి ఓర్వలేక, తన ఉనికి కాపాడుకోవడం కోసం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పొంతన లేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పోచంపాడు శివారు, వేంపల్లి శివారు రైతులు ఐటీఇండస్ట్రియల్‌ హబ్‌ కొరకు భూములు ఇచ్చేందుకు ఒప్పుకున్నారని, ఓ నలుగురు మాత్రం వారి స్వార్థ ప్రయోజనాల కోసం భూములు ఇవ్వడానికి ఒప్పుకోక పోవడంతో వారిని పక్కన పెట్టుకొని ప్రెస్‌మీట్‌లు పెట్టి తప్పుడు ఆరోపణలు చేస్తే త్వరలో దళితులు మాజీ ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించేందుకు సిద్ధం అన్నారు. 20 ఏండ్ల పాలనలో దివాకర్‌ రావు వేంపల్లి గ్రామానికి చేసిందేమీ లేదని, కాగా గ్రామానికి వచ్చిన నిధులు పక్క గ్రామాలకు తరలించారని ఆరోపించారు. ప్రాంత అభివృద్ధికి తాము భూములు ఇస్తే ఎకరాకు రూ.13.50 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం మాజీ ఎమ్మెల్యే జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. అందుకనే వంద మందిలో నలుగురిని పట్టుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వోలపు రమేష్‌, డేగ రాజేందర్‌, మొగిలి తిరుపతి, ఐటీ, ఇండస్ట్రియల్‌ హబ్‌కు భూములు ఇచ్చిన రైతులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షకు పాటుపడాలి



నవతెలంగాణ-జైపూర్‌

పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉన్నదని టేకుమట్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి అన్నారు. శనివారం ఎకో క్లబ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నీటిని వృధా చేయకూడదని, మొక్కలు నాటడం ఫలితంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తాం



నవతెలంగాణ-జైపూర్‌

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26 నుండి మూడు రోజుల పాటు నిర్వహించుకునే వేలాల మల్లికార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు అనుకూలంగా ఏర్పాట్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. వేలాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్‌తో కలిసి స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపురావు వేలాల జాతర సంధర్భంగా కొనసాగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్‌ ఏరియా పరిశీలించిన అధికారులు రద్దీ ప్రదేశాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వేలాల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్‌, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ కరపత్రాల విడుదల

నవతెలంగాణ-తలమడుగు

అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్‌ గోడం గణేష్‌ మాట్లాడారు. వచ్చే నెల మార్చి 8న మావల మండలం కుమురం భీమ్‌ కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ సభను ఆదివాసి మహిళా సంఘం తుడుం దెబ్బ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ క్రమంలో ఆదివాసీ మహిళల ఆదివాసీ హక్కులను రక్షించిన మహిళా మణులను త్యాగాలను గుర్తించాల్సిన అవసరముందని అన్నారు. ఈ పురుషాధిక్య సమాజంలో మహిళ కు సమానంగా సమ న్యాయం, రాజకీయ, సామాజిక భాగస్వామ్యం చేయమని కోరుతున్నాం. దీనిపై ఉద్యమించాలని అన్ని వర్గాల మహిళలకు ప్రజలకు ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, కార్మిక, కర్షక వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌, డివిజన్‌ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌, గిరిజన నాయకులు కేశవ్‌, భుజంగరావు, దాంజి పటేల్‌, అశోక్‌, రాము, పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్‌ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి వారోత్సవాల సందర్భంగా శనివారం బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ క్రికెట్‌ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతీ, యువకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణంగా తీసుకోవాలన్నారు. ఈరోజు ఓడిపోయిన రేపు గెలవచ్చనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన పారిశ్రామికవేత్త కాటిపల్లి వసంత్‌రెడ్డి తన సొంత డబ్బులతో తీసుకువచ్చిన ధ్వజస్తంభానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పిడుగు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, బడేగారి స్వామి, భూమన్న, బీఆర్‌ఎస్‌ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌, అభిరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తోట ప్రమోద్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.